www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 08 | జూన్ | 2026
పేజీలు : 7


# పాఠశాలలకు సెలవులు పొడిగింపు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్రంలో పాఠశాలలకు సెలవులు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ప్రకటించిన విధంగా జూన్ 12కు బదులు జూన్ 15 నుంచి పాఠశాలలు తెరచుకోనున్నాయి. జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభం కావాల్సి ఉండగా రాష్ట్రంలో ఎండ తీవ్రత ఇంకా పూర్తిగా తగ్గకపోవడం, ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతుండడంతో విద్యార్థుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దానికి అనుగుణంగా మరో మూడు రోజులు సెలవులు పొడిగించింది. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కావాల్సి ఉండగా ఆరోజుతో పాటు జూన్ 13 రెండవ శనివారం, జూన్ 14 ఆదివారం కావడంతో జూన్ 15 నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునః ప్రారంభించాలని ప్రభుత్వం భావించింది. ఈనెల 13న రెండవ శనివారం సెలవు ప్రకటించిన నేపథ్యంలో జూలై 11న రెండవ శనివారాన్ని వర్కింగ్ డేగా ప్రభుత్వం ప్రకటించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలను పునః ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది.

# ఖమ్మంకు ఆంధ్రా ఇసుక..!





**-తెలంగాణ అధికారుల సహకారం**
**-బోనకల్ సరిహద్దుల నుంచి జిల్లాలోకి ప్రవేశం**
**-మామూళ్ల వల విసురుతున్న ఇసుక సిండికేట్**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇసుక పిరమైంది. కొనే వారికి కన్నీళ్లని, అక్రమార్కులకు కాసులను కురిపిస్తుంది. ఇప్పుడు ఇసుక అక్రమ రవాణా లాభసాటి వ్యాపారంగా మారింది. ఇదే అదునుగా కొందరు బరితెగించారు. ఖమ్మం జిల్లాలో ప్రైవేటు నిర్మాణాలకు ఇసుక కొరత ఏర్పడింది. గోదావరి పరివాహక ప్రాంతంలోని ఇసుక ర్యాంపుల

మిగతా 2లో..

# విద్యుత్ అవసరాలకనుగుణంగా విస్తరణ




**-డిమాండ్ పెరిగినా కోతలు లేవు**
**-ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క**
**-అవసరాలకు అనుగుణంగా ఉప కేంద్రాల ఏర్పాటు**
**-20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తే లక్ష్యం**
**-విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ రంగంలో మౌలిక వసతులను నిరంతరం విస్తరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి




పదంలో ముందుకు తీసుకెళ్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని పాకబండ వద్ద ఎన్‌పిడిసిఎల్

మిగతా 2లో..

# సింగరేణి యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలి




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్మికుల శ్రమతో సింగరేణి సంస్థ మనుగడ సాగిస్తోందని, కానీ యాజమాన్యం సంస్థకు మూలాధారమైన కార్మికులను చిన్న చూపు చూస్తోందని, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న యాజమాన్యం ఇకనైనా మానుకోవాలని, కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు చేయక తప్పదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఆదివారం జరిగిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసీ) కేంద్ర కౌన్సిల్ సమావేశం తొలి

**- కార్మిక సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు ఉధృతం**
**- గుర్తింపు సంఘం కేంద్ర కౌన్సిల్ సమావేశంలో కూనంనేని**

రోజు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సింగరేణి సంస్థలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రతకు విఘాతం కలిగించే విధానాలను యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2లో..

# పోలీసుల హడావుడి అప్పుడేమైందో..?

**-సంపన్నులకు ఓ రీతి- పేదలకు మరో రీతినా**
**-సిపిఐ నాయకుల ఆచూకీ కోసం వెతుకులాట**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పోలీసుల వ్యవహారం అవతలి వ్యక్తుల స్థాయి, అధికార హోదాను బట్టి ఉండటం శోచనీయం. సామాన్యులైతే ఒక రీతి, సంపన్నులైతే మరో రీతిగా వ్యవహరిస్తుండటమే ఇప్పుడు ఖమ్మంలో చర్చనీయాంశమైంది. లేని దానికి ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీసుల హడావుడి చేయడం, సిపిఐ నాయకుల ఆచూకీ కోసం ప్రయత్నించడం వివాదంగా మారింది. ఖమ్మం నగరంలో ఉన్న ఎన్నెస్పి మేజర్‌ను ఇప్పుడు కొందరు ఆక్రమించుకున్నారు. ఆక్రమణ స్థలాలకు కొందరు ఫెన్సింగ్ వేసుకోగా మరికొందరు నిర్మాణాలు పూర్తి చేసి అద్దెలకు ఇచ్చే పనిలో ఉన్నారు. గత కొంత కాలంగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు సంబంధించి రాజకీయ పార్టీలు, వివిధ సంస్థలు, ఉన్నతాధికారులు , ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా, వినతి పత్రాలు అందజేసినా ఎవరు స్పందించలేదు. కంటి తుడుపు చర్యగా రెండు మూడు రోజుల క్రితం ఓ సర్వే నిర్వహించారు. ఈ సర్వే ఫలితం ఏమిటో కూడా ఎవరికి తెలియదు. గతంలో ఇదే కాలువపై పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకుంటే న్యాయ స్థానాలకు వెళ్లి అధికారం అండగా

మిగతా 2లో..



# విద్యుత్ అవసరాలకనుగుణంగా విస్తరణ



(మొదటిపేజీ తరువాయి)

ఆధ్వర్యంలో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి ప్రారంభించారు. విద్యుత్ ఉప కేంద్రంలోని కంట్రోల్ రూమ్ ఆధునీక పరికరాలను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రికి అధికారులు సాంకేతిక వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ ఆధునీక, సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ఉప కేంద్రాన్ని నిర్మించడం జరిగిందని కంట్రోల్ రూమ్ నుంచే నిర్వహించేవిధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గతంతో పోలిస్తే ఖమ్మంజిల్లాలో విద్యుత్ డిమాండ్ గణంగా పెరిగినప్పటికీ వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాలు సహా అన్ని రంగాలకు ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. 2023లో రాష్ట్రం పీక్ డిమాండ్ 15వేల మెగావాట్లు ఉండగా ప్రస్తుతం 18548 మెగావాట్లకు పెరిగిందన్నారు. మూసి పునర్జీవనం, ఫ్యూచర్ సిటీ, పరిశ్రమలు, ఫార్మసిటీ, డేటా సెంటర్లు, వ్యవసాయ రంగ విస్తరణ వంటి కారణాలతో భవిష్యత్తులో విద్యుత్ అవసరాలు మరింత పెరుగుతాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ రంగంపై ప్రత్యేక దృష్టిసారించి 2030 నాటికి 20వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో 85 గ్రామాలను పూర్తి స్థాయి సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, బోనకల్ మండలంలో సోలార్ ఆధారిత విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇందిరా గిరి జల వికాస పథకం క్రింద సుమారు ఆరులక్షల ఎకరాలకు సోలార్ పంపుసెట్ల ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. 2047 నాటికి తెలంగాణ మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని దానికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని బలోపేతం చేస్తూ ముందుకెళ్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా విద్యుత్ కొరత పరిస్థితులు ఉన్నప్పటికీ తెలంగాణలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కొనసాగుతుందన్నారు. ఖమ్మం నగరం వేగంగా అభివృద్ధి చెందుతుందని దానికి అనుగుణంగా కొత్త విద్యుత్ ఉప కేంద్రాలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రత్యేక రైతు డిస్కం ద్వారా రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగుతుందని ఉచిత విద్యుత్‌పై జరుగుతున్న దుష్ప్రచారాలను రైతులు నమ్మవద్దన్నారు. రాష్ట్రంలో 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వం ప్రతి నెల రూ.1150 కోట్ల సబ్సిడీ అందిస్తుందన్నారు. విద్యుత్ వైర్లు, స్తంభాల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని, లూజ్ వైర్లను వెంటనే సరి చేయాలన్నారు. విద్యుత్ శాఖ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని దేశంలో ఎక్కడలేనివిధంగా కోటి రూపాయల ప్రమాద బీమా కల్పించామన్నారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఖమ్మం నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మరిన్ని ఉప కేంద్రాలు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలను బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు వేగవంతం చేయాలని ఆదేశించారు. రోడ్లు, భవనాలు, విద్యుత్, మున్సిపల్, నీటిపారుదల శాఖాధికారులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తవుతాయన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఖాళీగా ఉన్న భూముల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో విద్యుత్ వినియోగం నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తు 30 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్, మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నగరంలో మరో ఐదు విద్యుత్ ఉప కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన భూముల కేటాయింపును వారం రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి ఖాదర్‌బాబా, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మంకు ఆంధ్రా ఇసుక..!



(మొదటిపేజీ తరువాయి)

నుంచి వస్తే తప్ప స్థానిక రేవుల నుండి ఇసుక లభ్యం కావడం లేదు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకే లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లాకు చెందిన కొందరు ఇసుక వ్యాపారులు ఖమ్మం జిల్లాలోని సరిహద్దు ప్రాంత పోలీసులు, రెవెన్యూ అధికారులకు మామూళ్ల వల విసిరి యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. కంచికచర్లలోని ఓ సిండికేట్ ఖమ్మం జిల్లా పోలీసులను, అధికారులను నియంత్రిస్తూ పది నుంచి 15 టిప్పర్ల ద్వారా ప్రతి రోజు ఒక్కో టిప్పర్ నుంచి ఒకటి లేదా రెండు ట్రిప్పుల ఇసుకను ఖమ్మం నగరంతో పాటు పరిసర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తుంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఈ టిప్పర్లు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. దీనికి తోడు కృష్ణాజిల్లా వత్సవాయి మండలం లింగాల సమీపంలోని మున్నేటి నుంచి కూడా ట్రాక్టర్ల ద్వారా బోనకల్, చింతకాని మండలాల ద్వారా ఖమ్మం జిల్లాలోకి ఇసుక ట్రాక్టర్లు ప్రవేశిస్తున్నాయి. వీటిని కూడా ఆపే నాథుడు లేకపోవడంతో యథేచ్ఛగా సరఫరా జరుగుతుంది. ఇసుక ట్రాక్టర్లకు సంబంధించి కొందరు అధికారులకు నెల వారి మామూళ్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. టిప్పర్ యజమానులు కూడా మామూళ్ల కప్పం కట్టిన తర్వాతే జిల్లాలోకి ప్రవేశిస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వినవస్తున్నాయి. కంచికచర్ల నుంచి ఇసుక సరఫరా చేస్తున్న సిండికేట్‌కు చెందిన టిప్పర్లు అతివేగంగా ప్రయాణించడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్లపల్లిలో టిప్పర్ అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓ పంచాయతీ వార్డు సభ్యుడు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సరిహద్దుల వద్ద గల పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతుంది. అక్రమ ఇసుక రవాణాపై కొందరు పోలీస్ అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నా పోలీస్ శాఖ నుంచే ఇసుక అక్రమ రవాణాదారులకు సమాచారం అందుతుందని దీనితో అక్రమార్కులు పోలీస్ ఉన్నతాధికారులకు, సర్కిల్ స్థాయి అధికారులకు చిక్కడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మొత్తంగా ఇసుక అక్రమ రవాణా కొందరికి కాసులు కురిపిస్తుంది. ఆంధ్రా నుంచి ఇసుక అక్రమ రవాణా తెలంగాణ అధికారుల సహకారానికి సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ఇసుక సిండికేట్లకు సహకరిస్తున్నదెవరు...? నెలవారి మామూళ్లు అందిస్తున్న ముఠా ఎవరు అన్న దానిపై కూడా పూర్తి స్థాయి విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

# సింగరేణి యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలి






(మొదటిపేజీ తరువాయి)

నుంచి సింగరేణికి రావలసిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కొత్త గనుల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని, నిలిచిపోయిన మెడికల్ బోర్డులను పునరుద్ధరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలు, ప్రమోషన్లు, క్లర్క్ పోస్టుల భర్తీ, డిస్మిస్ అయిన కార్మికులకు ప్రత్యేక అవకాశం కల్పించడం వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత నెల గోలేటి నుంచి కొత్తగూడెం వరకు నిర్వహించిన సింగరేణి జాత విజయవంతం కావడంలో సహకరించిన కార్మికులు, నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణిలో కార్మిక వ్యతిరేక విధానాలు పెరుగుతున్నాయని విమర్శించారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్నును యాజమాన్యమే భరించాలని, స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్లను అమలు చేయాలని కోరారు. సహజ మరణం పొందిన కార్మికుని కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అన్ని పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మైనింగ్ స్టాఫ్ ప్రమోషన్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నాయకులు కోరారు. సమస్యల పరిష్కారంలో యాజమాన్యం సానుకూలంగా స్పందించకపోతే ఉద్యమాలను



మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు యూనియన్ నాయకుడు కొమురయ్య కాంస్య విగ్రహ పునః ప్రారంభోత్సవ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అదనపు కార్యదర్శి మిర్యాల రంగయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు సారయ్య, కందికట్ల వీరభద్రయ్య, వై.వి.రావు, ముస్కే సమ్మయ్య, సెంట్రల్ సెక్రటరీలు వంగ వెంకట్, వీరస్వామి, అన్ని ఏరియాల బ్రాంచ్ సెక్రటరీలు, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్లు పాల్గొన్నారు.

# పోలీసుల హడావుడి అప్పుడేమైందో..?

(మొదటిపేజీ తరువాయి)

పేదలను ఇక్కడి నుంచి తరలించేంత వరకు వివిధ ప్రయత్నాలు చేసి మొత్తానికి విజయం సాధించారు. పేదలను తరలించిన తర్వాత ఆ స్థలాలపై పేదలను తరలించడానికి కారకులైన వ్యక్తులే కన్నేసి కొందరిని ఊసిగొల్పడం కొన్ని చోట్ల తామే స్వయంగా ఆక్రమణలకు పూనుకున్నారు. పరిస్థితి ఇలా ఉండగా సిపిఐ ఆధ్వర్యంలో ఆక్రమణలపై ఆందోళన చేపట్టింది. ప్రభుత్వం గతంలో ప్రకటించినట్లుగా ఆక్రమణలు తొలగించి గ్రీన్‌బెల్ట్, పట్టణ ప్రకృతి వనాలు, పార్కులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. అధికారులు తగు రీతిలో స్పందించకపోతే పేదలను సమీకరించి స్థలాలను ఆక్రమిస్తామని హెచ్చరించింది. అయితే ఆదివారం ఎన్నెస్పి స్థలాల్లో సిపిఐ ఆధ్వర్యంలో ఆక్రమణ జరుగుతుందని పోలీసులు శనివారం సాయంత్రం నుంచి హడావుడి చేశారు. ఎన్నెస్పి స్థలాల వద్దకు పెద్ద సంఖ్యలో పోలీసులు చేరుకున్నారు.ఈ ప్రాంత సిపిఐ నాయకుల ఆచూకీ కోసం ప్రయత్నం చేశారు. పోలీసుల హడావుడి చూసి ఏదో జరుగుతుందని స్థానికులు సైతం ఆశ్చర్యానికి గురయ్యారు. పేదలు ఆక్రమిస్తారని సమాచారం ఉంటేనే హడావుడి చేస్తున్న పోలీసులు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు , కోటీశ్వరులు ఎన్నెస్పి స్థలాలను ఆక్రమిస్తే ఎందుకు స్పందించడం లేదని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడానికి సంపన్నులు, ఉన్నతాధికారులు, కోటీశ్వరులకు మాత్రమే అధికారం ఉందా అని పేదలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఒక్కొక్కరికి ఒక్కొక్క రీతిగా వ్యవహరించకుండా అందరికీ సమన్యాయం పాటించే విధంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

### ఆక్రమణలను తొలగించకుంటే ఆక్రమిస్తాం : దండి సురేష్

ఎన్నెస్పి స్థలాల్లో ఆక్రమణలు తొలగించి గతంలో ప్రభుత్వం చెప్పినట్లుగా గ్రీనరీ, పట్టణ ప్రకృతి వనాలు, పార్కులు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో పేదలను సమీకరించి ఆక్రమిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ప్రజా ఉపయోగమైన పనులు చేపట్టాలి తప్ప కొందరి ఆక్రమణల పట్ల ఉదాసీనత వహించ రాదని సురేష్ సూచించారు. చాలా కాలంగా ఎన్నెస్పి స్థలాలను ఆక్రమించుకుని ప్రహారీ గోడల నిర్మాణం, ఫెన్సింగ్, ఏకంగా ఇండ్ల నిర్మాణాలే చేపడితే స్పందించని పోలీసులు రెవెన్యూ, కార్పోరేషన్, నీటిపారుదల శాఖాధికారులు ఆదివారం ఎందుకు హడావుడి చేశారని ఆయన ప్రశ్నించారు. ఆక్రమణలను తొలగించక పోతే పేదలను సమీకరించి నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు ఆక్రమించి గుడిసెలు వేస్తామని సురేష్ తెలిపారు. ఆక్రమణల విషయమై ఖానాపురం హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీని ప్రశ్నించగా ఆక్రమణలకు సంబంధించి ఆధారాలతో సహా గడచిన నాలుగు నెలలుగా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నామని ఆక్రమణలను తొలగించక పోతే ఖాళీ ఉన్న స్థలాల్లో పేదలచే గుడిసెలు వేయిస్తామని దశాబ్ద కాలంగా ఖమ్మం నగరంలో నివాస స్థలాల పంపిణీ జరగలేదని పేదలు ఇబ్బందులు పడుతున్నారని సంపన్నులు ఆక్రమించే కంటే పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకోవడాన్ని ప్రభుత్వం కూడా స్వాగతించాలని ఆయన కోరారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి

**-గ్రామసభల ద్వారా రైతులకు అవగాహన**
**-జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రస్తుతం వాతావరణ శాఖ అంచనాల ప్రకారం 2026 వానాకాలంలో ఎల్ నినో ప్రభావం వల్ల సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిసారించాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య ఆదివారం తెలిపారు. వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖ, ఉద్యానవన శాఖ, భూగర్భ వనరుల శాఖలు సంయుక్తంగా గ్రామాల్లో రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సిద్ధం చేసిందన్నారు. జూలై 15 వరకు వర్షాలు పడక పోతే సాగు చేయాల్సిన పంటలు, జూలై 30 వరకు వర్షాలు ఆలస్యమైతే చేపట్టాల్సిన పంటల ప్రణాళిక అలాగే ఆగస్టు 15వరకు వర్షపాతం నమోదు కాకపోతే సాగు చేయాల్సిన పంటలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. వర్షాలు ఆలస్యమైన పరిస్థితిలో వరి సాగు చేసే రైతులు సాంప్రదాయ నాటు విధానానికి బదులుగా వెదజల్లే పద్ధతిని అనుసరించాలని సూచించారు. స్వల్ప కాలిక వరి రకాలైన బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, డబ్ల్యూజిఎల్ 44, జెజిఎల్ 1978, ఎంటియు 1010, జెశ్రీరామ్, హెచ్ఎంటి సోనా వంటి రకాలను సాగు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చునని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల సాగు విస్తీర్ణం తగ్గిన పక్షంలో వాటి స్థానంలో పెసర, మినుము, బొబ్బర, కంది, వేరుశనగ వంటి పంటలను సాగు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన పెసర విత్తనాలను ఆత్మ నిర్భరత మిషన్ పథకం క్రింద రాయితీపై అందజేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామసభల ద్వారా విస్తృత అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పత్తి సాగు చేసే రైతులు తొందరపడి విత్తనాలు వేయవద్దని భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడే విత్తనాలు వేయాలని సూచించారు. కనీసం 60 నుంచి 70 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే పత్తి విత్తనాలు వేయడం మంచిదని జూలై 15 వరకు పత్తి సాగుకు అనుకూల సమయం ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.

# నేడు మంత్రి తుమ్మల పర్యటన




**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో పర్యటించనున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వి. వెంకటాయపాలెం గ్రామంలోని జగ్యాతండా మెయిన్ రోడ్డులో సుడా నిధులు కోటి రూపాయలతో చేపట్టనున్న సిసి రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం రూ. 30 లక్షలతో నూతనంగా నిర్మించిన పశు ఆరోగ్య ఉప కేంద్రాన్ని (వెటర్నరీ ఆసుపత్రి) మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు.

# ఇన్‌స్ట్రక్టర్, ఆయాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రీ ప్రైమరీ బోధనకు ఇన్‌స్ట్రక్టర్, ఆయాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి బి. రాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రఘునాథపాలెం మండలంలో ఐదు పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను పూర్వ ప్రాథమిక తరగతుల నిర్వహణకు అనుమతులు వచ్చినట్లు ఎంఈవో తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఒక ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయా పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. యుపిఎస్ చింతగుర్తి, యుపిఎస్ గణేశ్వరం, పిఎస్ చిమ్మపూడి, పిఎస్ మంచుకొండ, యుపిఎస్ రాంక్యాతండా పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ బోధనకు ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో కోరారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ ఆపై అర్హత ఉండాలని, ఆయా పోస్టుకు ఏడవ తరగతి ఆపై ఉండాలని తెలిపారు. ఎంపికైన వారికి ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ. 8వేలు, ఆయాకు రూ.6వేలు గౌరవ వేతనం అందజేయనున్నట్లు ఎంఈవో తెలిపారు. అభ్యర్థులు హాబిటేషన్, తమ గ్రామం లేదా మండలానికి చెందిన వారై ఉండాలని, 18 నుంచి 44 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వయో పరిమితిలో సడలింపులు వర్తిస్తాయన్నారు. మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ జూన్ ఎనిమిది నుంచి తొమ్మిది వరకు జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు రఘునాథపాలెం మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఎంఈవో సూచించారు.

# మానవత్వం చాటుకున్న మంత్రి పొంగులేటి

**- బాలుడి బ్రెయిన్ ఆపరేషన్‌కు ఆర్థికసాయం**
**- కృతజ్ఞతలు తెలిపిన మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని తెల్దారుపల్లికి చెందిన గుంజి రాకేష్(15) బ్రెయిన్ ఆపరేషన్ కోసం అత్యవసరంగా సహాయం అవసరమైన నేపథ్యంలో వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ద్వారా మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన మంత్రి అవసరమైన సహకారం అందించడంతో ఆపరేషన్ విజయవంతంగా పూర్తైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంత్రి పొంగులేటితో పాటు ప్రత్యేక చొరవ తీసుకొని సహాయ సహకారాలు అందించిన తుంబూరు దయాకర్‌రెడ్డికి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నిరుపేద కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో మంత్రి దేవుడిలా అండగా నిలిచి బాలుడి చికిత్సకు మార్గం సుగమం చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుంబూరు దయాకర్‌రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బాలుడు సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.

# కరాటే శిక్షణ ఇస్తున్న రఘుకు అభినందనలు



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో ఇండోర్ స్టేడియం సమీపంలో కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైరా ఎస్సై పుష్పాల రామారావు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ పాల్గొన్నారు. డబ్ల్యూఎఫ్ఎస్‌కెవో ఆధ్వర్యంలో గ్రీన్ బిల్ట్ కార్యక్రమంలో శిక్షణ పొందిన వారికి గ్రీన్ ఆరెంజ్ ఎల్లో విభాగాల్లో సర్టిఫికెట్లను కరాటే శిక్షణ మాస్టర్ రఘు ఆధ్వర్యంలో ఎస్సై పుష్పాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కరాటే శిక్షణను ఇచ్చి తీర్చిదిద్దుతున్న రఘును వారు అభినందించారు. గత కొన్ని సంవత్సరాలుగా రఘు ఎండాకాలంలో ఎంతోమందికి కరాటే శిక్షణ ఇచ్చి రాష్ట్రస్థాయిలో పాల్గొనే విధంగా తీర్చిదిద్దాడని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కరాటే శిక్షణ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# మెరిట్ విద్యార్థులకు అండగా కమ్మజన సేవా సమితి

**-46 మంది విద్యార్థులకు ఆర్థిక చేయూత**
**-రూ.2.30లక్షలు అందించిన కమ్మజన సేవా సంఘం**








**పరజాపక్షం/వైరా:** వైరాలో కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన వైరా, కొణిజర్ల, తల్లాడ మండలాల పరిధిలోని ఉత్తమ విద్యార్థిని, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించి వారికి అండగా నిలిచింది. విద్యార్థులకు నగదు పంపిణీ కార్యక్రమం ఆదివారం వైరాలో కమ్మవారి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 46 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున రూ.2.30లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ అనేక మంది పెద్దలు కృషితో కమ్మజన సేవా సమితి ముందుకు సాగుతుందని, ఎంతోమంది విద్యార్థులకు అండగా నిలిచిన కమ్మ సేవా సమితి అని అన్నారు. విద్యార్థులకు ఆత్మ విశ్వాసం పెరగాలి, ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించడం ఎంతో సంతోషం, మంచి ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నారు. 18 ఐఐటిలు ఇండియాలో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ప్రపంచంలో ఉన్నత స్థాయిలో ఉన్నారు. డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ పదో తరగతి ప్రతిఒక్కరికి టర్నింగ్ పాయింట్, మీ భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి, అబ్దుల్ కలాం చెప్పినట్టు కలలు కనాలి, సహకారం చేసుకోవాలని అన్నారు. అది నిజం చేసుకోవాలి, ఇంటర్‌తోనే భవిష్యత్తు ప్రారంభం అవుతుంది, అది విద్యార్థులు గుర్తు ఉంచుకోవాలని అన్నారు. పోతినేని భూమేష్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మరింత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి, సోషల్ మీడియాకు అలవాటు పడకుండా దూరంగా ఉండాలి, తల్లిదండ్రులు పిల్లలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మజన సేవా సమితి అధ్యక్షుడు కట్టా కృష్ణార్జునరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, డాక్టర్ కాపా మురళీకృష్ణ, పోతినేని భూమేష్, దామోదర్‌రావు, అడపా రామకోటయ్య, దొండపాటి రమేష్, మధుసూదన్‌రావు, మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు, శ్రీరామనేని రామస్వామి, చింతనిప్పు రాంబాబు, కాపా వీరభద్రరావు, సూర్యదేవర శ్రీధర్, ఏనుగు హనుమంతరావు, శ్రీరామనేని విజయభాస్కర్, లగడపాటి ప్రభాకర్ రావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, పొదిలి హరినాథ్, పాలేటి నర్సింహా రావు తదితరులు పాల్గొన్నారు.

# మౌలాలికి ప్రపంచ తెలుగు ప్రతిభా పురస్కారం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పేరువంచ ఉన్నత పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న మహమ్మద్ మౌలాలి ఆదివారం రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభా పురస్కారం అందుకున్నారు. శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జూన్ 6 ,7 తేదీలలో నిర్వహించబడిన ఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలో అత్యంత వైభవంగా సాహిత్య సాంస్కృతిక వైభవంగా ప్రతీకగా ఘనంగా జరిగాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు అమెరికా, కువైట్ ఇతర దేశాల నుంచి వచ్చిన కవులు రచయితలు కళాకారులు భాషాభిమానులతో సభలో సాహిత్య సుగంధాలను వెదజల్లాయి. ఈ సభలలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా పేరువంచ జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు మౌలాలి మానవత్వ దీప్తి మాయమవుతున్న వేళ యుగానికి మేలుకొలుపు అనే కవితను సభా వేదికపై ఆలపించి విశేష ఆదరణ పొందారు. నేటి సమాజంలో క్రమంగా కనుమరుగవుతున్న మానవీయ విలువలను కరుణను, ప్రేమను, సహనాన్ని ,సామాజిక బాధ్యతను, ప్రతిబింబిస్తూ ఆయన వినిపించిన కవిత సభికులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రాచీన తెలుగు సాహిత్యానికి చిరస్మరణీయులైన శ్రీనాథ్, కొచ్చర్ల గోపన్న, కాసుల పురుషోత్తమ కవి, వంటి మహనీయులు, కవుల వారసులు, ఆధునిక కవులు, రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొన్న సభలో మొహమ్మద్ మౌలాలి తన కవితను వినిపించి ప్రశంసలను అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి ప్రతిభ పరిష్కారం జ్ఞాపిక శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సభలో కె వి వి సత్యనారాయణ రాజు, ఈశ్వరి, భూషణం ప్రతాప్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కల్లూరు మండల విద్యాశాఖ అధికారి నివేదిత మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్ కౌన్సిలర్లు పలు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, పేరు వంచ గ్రామస్తులు, పలువురు సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, ఆయనను అభినందిస్తూ హర్షిస్తూ ఆయనకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# బోనాల సందడి...!



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని వివిధ గ్రామాలలో ఆదివారం బోనాల సందడి నెలకొంది. మండలం లోని ఆచార్లగూడెం లో గంగమ్మ తల్లి దైవం కు బోనాల పండగ ను నిర్వహించారు. గ్రామం లో మహిళలు బోనాలను ఎత్తుకుని ప్రదర్శన నిర్వహించారు. దేవాలయం వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆటా, పాటలతో సందండి చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు లిక్కి హనుమంత రావు, తదితరులు పాల్గొన్నారు. మండలం లోని రాయగూడెం లో బొడ్రాయి వద్ద బోనాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోయిన వేణు, సొసైటీ చైర్మన్ తీగ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం



# గంగాదేవి గుట్టను మింగేస్తున్న అక్రమ మట్టి మాఫియా..!

**-గోదాం పేరుతో గుట్ట తవ్వకాలు**

**-అధికారుల మౌనంపై గ్రామస్తుల ఆగ్రహం**



**ప్రజాపక్షం/కారేపల్లి :** సింగరేణి మండలంలోని గుట్టకింద గుంపు గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న గంగాదేవి గుట్ట అక్రమ మట్టి తవ్వకాలతో క్రమంగా కనుమరుగవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోదాం నిర్మాణం పేరుతో గుట్టను భారీ యంత్రాలతో తవ్వి మట్టిని విక్రయిస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి సంపదగా, స్థానికుల ఆరాధ్య ప్రదేశంగ్గ ఉన్న గంగాదేవి గుట్టను నాశనం చేస్తూ జరుగుతున్న తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా పట్టపగలు మట్టి తవ్వకాలు, తరలింపులు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని గ్రామస్తులు ఆరోపించారు. అక్రమ మట్టి దందా కారణంగా గుట్ట ఆకృతి మారిపోతోందని, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రెవెన్యూ, గనుల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మట్టి తవ్వకాలను తక్షణమే నిలిపివేయకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ నిరసనలో గుట్టకింద గుంపు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బానోత్ కాంతి మృతికి నివాళి



**ప్రజాపక్షం/కారేపల్లి:** భాగ్యనగర్ తండా గ్రామ పంచాయితీ మాజీ 6వ వార్డు సభ్యుడు బానోత్ లింగు మాతృమూర్తి బానోత్ కాంతి మృతికి యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు గుగులోత్ హర్ష నాయక్ నివాళులర్పించారు. మృతురాలి నివాసానికి వెళ్లి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు గుగులోత్ సోమ్లు, బాలు, సిద్ధు, భద్రయ్య, హనుమ, మోహన్, తదితరులు పాల్గొని మృతురాలికి నివాళులర్పించారు.

## డ్రైనేజీ లేక మురుగు నీరు రోడ్లపై నిల్వ

**-తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు -అధికారులపై ఆగ్రహం**



**ప్రజాపక్షం/మణుగూరు:** సమితి సింగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఉడుతనేని గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల ముందు, రహదారులపై నిల్వ అవుతోంది. దీంతో గ్రామంలో తీవ్ర అస్వచ్ఛత పరిస్థితులు ఏర్పడి దుర్వాసన వ్యాపిస్తోంది. రోడ్లపై మురుగు నీరు అడ్డంగా నిలవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు ఈ పరిస్థితుల్లో జీవించాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంటువ్యాధుల ప్రమాదం పెరుగుతోందని కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ సమస్యపై అధికారులకు అంతిమపత్రం (ఫిర్యాదు) అందజేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో వెంటనే డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి మురుగు నీరు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సర్ ప్రక్రియలో నిర్లక్ష్యం తగదు

**అర్హత కలిగిన ప్రతీ ఓటరు జాబితాలో ఉండాల్సిందే..**




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఓటరు ప్రత్యేక సవరణ కార్యక్రమ అమలు లో ఎలాంటి నిర్లక్ష్యం తగదని నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం బీఎల్వీ లకు సర్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం రాజేశ్వరపురం లోని సర్ కార్యక్రమం ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 25 నుంచి జూలై 24 వరకు సర్ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. బీఎల్ఏ లు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పూరించి సేకరించాలని సూచించారు. వలసలు, మరణించిన, డబుల్ ఓటర్ల తొలిగింపు కోసమే తప్పా...అర్హులను తొలిగించేందుకు ఎంత మాత్రం కాదని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతీ ఓటరు పేరు జాబితాలో ఉంటుందని పేర్కొన్నారు. ఆధార్ కార్డు గుర్తింపు కు మాత్రమే పరిగణించాలని, పుట్టిన తేది నిర్ధారణ కు ఇతర పత్రాలను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కనకం నరసింహారావు, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్స్ ఆలస్యం మధుసూధనరావు, అల్లం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు యూనియన్ కొమురయ్య కాంస్య విగ్రహ పునఃప్రతిష్ఠ

**-ప్రతిష్ఠించనున్న యూనియన్ గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్యే కూనంనేని కార్యక్రమానికి యూనియన్లకతీతంగా తరలి రావాలి**

**- వర్కర్స్ యూనియన్ నేతలు సీతారామయ్య, రాజ్‌కుమార్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి, స్వాతంత్ర్య సమరయోధులు మనుబోతుల కొమురయ్య (యూనియన్ కొమురయ్య) కాంస్య విగ్రహాన్ని సోమవారం సాయంత్రం 4.00 గంటలకు యూనియన్ గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రతిష్టించనున్నట్లు ఆ యూనియన్ కేంద్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో ఎనిమిది గంటల పని విధానాన్ని సాధించిన ఘనత కొమురయ్యదేనన్నారు. విచ్చలవిడిగా కొనసాగుతున్న కాంట్రాక్టు విధానాన్ని కొమురయ్య పోరాటాల ఫలితంగానే వెనక్కు పంపించగలిగాడని, ఆనాడు బావుల్లో పనిచేసే మహిళా కార్మికులకు సర్వేస్ ఉద్యోగాలు కల్పించడంలో, పది సంవత్సరాలలోపు పిల్లలతో పనిచేయించుకునే విధానాన్ని వ్యతిరేకించాడని, రేగే, జాదవ్ కమిటీల ద్వారా, ముజుందాస్, దాస్‌గుప్తా, రఘునాథ్ రెడ్డి అవార్డుల ద్వా రా, పలు జాతీయ వేతన ఒప్పందాలు, సమ్మెపోరాటాల ద్వారా కార్మికులకు ఎన్నో హక్కులు సాధించిపెట్టిన ఘనత కేవలం కొమురయ్యకే దక్కుతుందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికవర్గం కోసం, ఈ ప్రాంత ప్రజలకోసం ఆయన అందించిన సేవలకు మరింత గుర్తింపు తెచ్చేందుకు కాంస్య విగ్రహాన్ని పునఃప్రతిస్తున్నామని, కార్యక్రమానికి సిపిఐ, ఏఐటియుసి నాయకులు కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

# ప్రమాదాలకు నిలయంగా ప్రధాన రహదారి..!

**-డ్రైన్లు, డివైడర్లకు రేడియం గుర్తులు లేక రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు**

**-ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు**

**-భయాందోళనలో ప్రయాణికులు**







**ప్రజాపక్షం/అశ్వాపురం :** కొత్తగూడెం, మణుగూరు ప్రధాన రహదారిపై ఆర్అండ్‌బి శాఖ అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా ప్రజలు ప్రాణాలను పణంగా పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. కోట్లాది రూపాయలతో రహదారి అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పుకుంటున్న అధికారులు, ప్రయాణికుల భద్రతకు అత్యంత కీలకమైన హెచ్చరిక బోర్డులు, రేడియం సూచికలు ఏర్పాటు చేయడంలో మాత్రం పూర్తిగా విఫలమయ్యారని అశ్వాపురం మండల ప్రజలు మండిపడుతున్నారు.

**ప్రమాద సూచికలు లేక..ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆర్అండ్‌బి..**

అశ్వాపురం మండల పరిధిలోని పలు ప్రమాదకర మూల మలుపుల వద్ద ఇప్పటికీ హెచ్చరిక బోర్డులు లేకపోవడం వాహనదారులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. రాత్రి సమయంలో వేగంగా వచ్చే వాహనాలకు రహదారి మలుపులు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం రోజురోజుకూ పెరుగుతోంది. అంతే కాకుండా రహదారి మధ్యలో, పక్కన నిర్మించిన డ్రైన్లు, సెంటర్ డివైడర్లు, రక్షణ గోడలకు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడంతో పలువురు వాహనదారులు వాటిని గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే జరిగిన పలు ప్రమాదాలు దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. గత రెండు నెలలుగా ఈ రహదారిపై చిన్నా పెద్దా ప్రమాదాలు చోటు చేసుకున్నప్పటికీ ఆర్అండ్‌బి అధికారులు మాత్రం కార్యాలయాలకే పరిమితమయ్యారని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తరువాత కూడా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి భద్రతా చర్యలు అమలు చేయకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఎందుకింత నిర్లక్ష్యం....**


రహదారుల నిర్మాణం అంటే కేవలం హడావిడిగా వేయడమే కాదని, ప్రయాణికుల ప్రాణాలను కాపాడే భద్రతా ప్రమాణాలను పాటించడమూ అంతే ముఖ్యమని ప్రజలు గుర్తు చేస్తున్నారు. అయితే ఆర్అండ్‌బి శాఖ మాత్రం ఈ ప్రాథమిక అంశాలను విస్మరించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు, ఫ్లాషింగ్ లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో మరో ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తే దానికి పూర్తి బాధ్యత ఆర్అండ్‌బి అధికారులదేనని హెచ్చరిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈపరిస్థితిని ఉన్నతాధికారులు సమీక్షించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి నిద్రమత్తు వీడి చర్యలు చేపడతారా లేక మరో విషాదం కోసం ఎదురుచూస్తారా అనే ప్రశ్న మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని, వెంటనే భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు గట్టిగా హెచ్చరిస్తున్నారు.

# కాలం మార్చలేని బంధం

**-22 ఏళ్ల తర్వాత కలిసిన బాల్య మిత్రులు**

**-పాములేరులో ఆత్మీయ సమ్మేళనం**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** జీవిత ప్రయాణంలో ఎన్నె మలుపులు వచినా, బాల్య స్నేహం మాత్రం ఎప్పటికీ పదిలంగానే ఉంటుందనే విషయాన్ని న్యూస్కాలర్ కాన్వెంట్ స్కూల్, మోరంపల్లిబంజర్‌కు చెందిన 2004 ఏడో తరగతి బ్యాచ్ విద్యార్థులు మరోసారి చాటిచెప్పారు. దాదాపు 22ఏళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కుక్కునూరు మండలంలోని పాములేరులో నిర్వహించిన గెట్ టు గెదర్‌లో కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకప్పుడు ఒకే బెంచ్‌పై కూర్చొని చదువుకున్న స్నేహితులు నేడు వివిధ రంగాల్లో స్థిరపడినా, చిన్ననాటి అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆత్మీయంగా గడిపారు. పాఠశాల రోజులలో చేసిన అల్లర్లు, గురువుల బోధనలు, స్నేహ బంధాలు, మధుర సంఘటనలను గుర్తు చేసుకుంటూ ఆనంద క్షణాలను పంచుకున్నారు. జీవితంలో ఎంత బిజీగా ఉన్నా స్నేహబంధాలను కాపాడుకోవడం ఎంత ముఖ్యమో ఈ కలయిక చాటి చెప్పిందని పాల్గొన్న వారు పేర్కొన్నారు. భావోద్వేగాలు, ఆత్మీయత, నవ్వులు, జ్ఞాపకాలతో సాగిన ఈ కలయిక అందరికీ చిరస్మరణీయంగా నిలిచింది. ఈకార్యక్రమంలో భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, ధనలక్ష్మి, సంధ్యారాణి, చంద్రశేఖర్‌రెడ్డి, మౌనిక, శైలజ, అనంత్, శ్రవణ్, చంటి, రఘురామిరెడ్డి, కృష్ణారెడ్డి, హేమంత్, రాజశేఖర్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, ముకుందారెడ్డి, లక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఓటు హక్కు వజ్రాయుధం

**-అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలి**

**-ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సులో ఎంఎల్ఏ జారే, డీసీసీ అధ్యక్షురాలు తోట**



**ప్రజాపక్షం/దమ్మపేట:** ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న పిలుపునిచ్చారు. పట్వారిగూడెంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంఎల్ఏ జారే ఆదినారాయణ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటరుగా నమోదు కావాలని, చనిపోయిన వారి పేర్లు డబుల్ ఎంట్రీలను తొలగించాలని సూచించారు. నియోజకవర్గంలో ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అనంతరం డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ ఓటు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధమని, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. బీఎల్ఓలతో సమన్వయం చేసుకుని ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేర్ల సవరణలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా యువత, మహిళలు, కొత్తగా వివాహమైన మహిళల పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చికిటి కార్తీక్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం ప్రసాద్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గద్దెల రమేష్, అధికార ప్రతినిధి వై శ్రీనివాస్‌రెడ్డి, సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, బూత్ కమిటీ కన్వీనర్లు, బీఎలేలు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా బోనాల సంబరాలు









**ప్రజాపక్షం/ఏన్కూరు:** గ్రామీణ సంప్రదాయాలు, భక్తి విశ్వాసాలు, సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ జన్నారం ఎస్టీ కాలనీలో ఆదివారం ఘనంగా జరిగింది. ఆంజనేయస్వామి ఆలయం, బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలను గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు గ్రామదేవతలైన బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి నాభి శిలలకు జలాభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటి వద్ద పాలు పొంగించి బోనాలు సిద్ధం చేసిన మహిళలు, చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణలో మేళతాళాల నడుమ గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. భక్తుల జైజై ధ్వానాలు, డప్పుల చప్పుళ్లతో కాలనీ అంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. జన్నారం ఎస్టీ కాలనీ గ్రామ పంచాయితీ పరిధిలోని కోనయపాలెం తండాలో కూడా ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ సర్పంచ్ బానోత్ మణి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, చల్లటి తాగునీటి పంపిణీ చేయడం విశేషం. గ్రామస్తులంతా ఒక్కటై ఉత్సవాల్లో పాల్గొనడంతో పండుగకు ప్రత్యేక శోభ చేకూరింది. ఆలయ వార్షికోత్సవ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార సంప్రదాయాలను యువతరానికి పరిచయం చేస్తూ గ్రామ సంస్కృతిని కాపాడుతున్న తీరు ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతల నరసింహారావు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారుల, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూముల విక్రయంపై పూర్తి వివరాలు వెల్లడించాలి

**బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధులు నంబూరి రామలింగేశ్వరరావు, డాక్టర్ పుల్లారావు యాదవ్**





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిదిలోని బుగ్గపాడులో ఏర్పాటు చేసిన మెగా ఫుడ్ పార్క్‌లో సుమారు 84 ఎకరాల భూమిని ఒక ప్రైవేట్ సంస్థకు విక్రయించారనే వార్తలు ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలి డిమాండ్ చేశారు బిజేపి రాష్ట్ర అధికార ప్రతినిధులు నంబూరి రామలిం గేశ్వరరావు, డాక్టర్ పుల్లారావు యాదవ్. ఆదివారం వారు ఓ పత్రిక ప్రకటన విడుధల చేశారు. మెగా ఫుడ్ పార్క్ కేంద్ర ప్రభుత్వ సహకారం, నాబార్డు ఆర్థిక భాగస్వామ్యం , రాష్ట్ర ప్రభుత్వ వాటాతో ఏర్పాటు చేయబడిన ప్రాజెక్ట్ అని ఈ నేపథ్యంలో మెగా ఫుడ్ పార్క్ లో భూములను ఎలా విక్రయిస్తారన్నారు. బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్‌లో 84 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు విక్రయించారా..? ఆ సంస్థ పేరు ఏమిటి...? ఆ భూమిని విక్రయించడానికి లేదా కేటాయించడానికి తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ (టిజిఐఐసి/టిఎస్ఐఐసి) కు చట్టబద్ధమైన అధికారం ఉందా...?, ఈ నిర్ణయానికి రాష్ట్ర మంత్రివర్గం (క్యాబినెట్) ఆమోదం తీసుకున్నారా...?, తీసుకుని ఉంటే సంబంధిత నిర్ణయం, జిఓలను బహిర్గతం చేయాలను వారి కోరారు. కేంద్ర ప్రభుత్వం, నాబార్డ్ నిధులతో అభివృద్ధి చేసిన ప్రాజెక్ట్ భూములను బదిలీ చేయడానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకున్నారా...? ఎకరాకు ఎంత ధర నిర్ణయించారు...?, మార్కెట్ విలువ ఆధారంగా విక్రయించారా...? , లేక ప్రత్యేక రాయితీలు కల్పించారా..? అని ప్రశ్నించారు. ఇప్పటివరకు ఫుడ్ పార్క్‌లో ఎన్ని పరిశ్రమలు స్థాపించబడ్డాయి...?, ఎంత మందికి ఉద్యోగాలు కల్పించబడ్డాయి...?, అసలు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం ఏర్పాటు చేసిన పార్క్ లక్ష్యాలను మార్చే విధంగా భూములను విక్రయిస్తున్నారా...?, ప్రజా ధనంతో, రైతుల భూములతో ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల విషయంలో పూర్తి పారదర్శకత ఉండాలన్నారు. అందువల్ల ప్రభుత్వం సంబంధిత పత్రాలు, బోర్డు తీర్మానాలు, క్యాబినెట్ ఆమోదాలు మరియు విక్రయ ఒప్పందాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం సత్తుపల్లి, దమ్మపేట మండలాల్లో సాగే సీతారామ ప్రాజెక్ట్ పనుల్లో వచ్చిన మట్టిని 50 టిప్పర్లతో సాయంతో ఫుడ్ పార్క్ కు తరలించి అమ్మినట్లు ఆరోపణలు వస్తున్న 84 ఎకరాలను చదును చేస్తున్నారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని తక్షణమే సదరు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/పాల్వంచ :** నేడు పాల్వంచ లోని 33/11 కేవి సబ్ స్టేషన్‌లో అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామని దీనితో సుమారు రెండు గంటలు పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పాల్వంచ సబ్ డివిజనల్ ఇంజనీర్ రహిముల్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్వంచ, ములకలపల్లి మండలాల పరిధి పేటచెరువు, గుడిపాడు, పిల్లవాగు,కొత్తూరు, గుర్రాలకుంట, చింతలపాడు తదితర గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2026,27 విద్యా సంవత్సరానికి ప్రీ, ప్రైమరీ ఇన్‌స్ట్రకర్, ఆయా పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు తెలిపారు. ప్రీ, ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్‌తో పాటు ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ లేదా ప్రైమరీ టీచింగ్‌కు సంబంధించిన శిక్షణ అర్హత ఉండాలని, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణత సరిపోతుందని పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, స్థానికులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ 8వేలు, ఆయాకు రూ 6వేల గౌరవ వేతనం చెల్లిస్తారని చెప్పారు. విద్యార్హతలు, అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా మెరిట్ ప్రకారం ఎంపిక చేపడతామని వివరించారు. దరఖాస్తుల స్వీకరణకు జూన్ 9చివరి తేదీ కాగా, జూన్ 10న మండల స్థాయి మెరిట్ జాబితా విడుదల చేసి, జూన్ 11న తుది ఎంపిక జాబితాను ప్రకటించనున్నట్లు ఎంఈఓ దుగ్గిరాల జయరాజు తెలిపారు. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన మాత్రమే ఉంటాయని స్పష్టం చేశారు.

## ఘనంగా ముగిసిన శ్రీ కోటెమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు

**-అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ ఎంఎల్ఏ తాటి**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని నరసాపురం గ్రామంలోని శ్రీశ్రీశ్రీ కోటె మ్మ అమ్మవారి 20వ వార్షికోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఆదివారంతో ఘనంగా ముగిశా యి. శుక్రవారం ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎంఎల్ఏ తాటి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా కోటెమ్మ అమ్మవారు భక్తుల ఆరాధన పొందుతున్నారని, అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే కష్టాలు తొలగుతాయని అన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చా రు. ఈకార్యక్రమంలో తాండ్ర బుచ్చిబాబు, ఇనుగంటి రాము, మరీదు నాగేశ్వరరావు, బజ్జూరి చెన్నారావు, బజ్జూరి వెంకటేశ్వరరావు, పామర్తి కృష్ణారావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పుల మోహన్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## పాల్వంచలో సైబర్ క్రైం

**- బాదితుడిపై కేసు**




**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి కిన్నెరసాని పంచాయితి రాజాపురం గ్రామానికి చెందిన ఓ కిరాణషాపు యాజమాని సైబర్ క్రైం నేరగాళ్ళ ఉచ్చులో పడి కేసుల పాలైన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. యానంబైల్ గ్రామానికి చెందిన బుడగం సత్యనారాయణ గత కొన్ని సంవత్సరాలుగా రాజాపురంలో కిరాణషాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 4వ, తేదీన ఓ ఇద్దరు వ్యక్తులు కిరాణ షాపుకు వచ్చారు. తమకు అర్జంటు అవసరం ఉన్నదని షాపు యాజమానికి ఫోన్‌పే ద్వారా ఖమ్మం జిల్లా చింతకానికి చెందిన సట్టు రామలింగయ్య రూ.1850/లు పంపించి నగదు తీసుకొని వెళ్ళారు. అనంతరం తనకు అవసరమై ఫోన్ ద్వారా డబ్బులు పంపించటానికి సత్యనారాయణ ప్రయత్నించారు. టెక్నికల్ ప్రాబ్లం ఉందని తెలిసింది. మరుసటి రోజు ఎస్‌బిఐ బ్యాంకులో సంప్రదించగా సైబర్ ఫ్రాడ్ యుపిఐ రిలేటెడ్‌తో తన ఖాతా ఫ్రీజ్ అయినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. దీనితో సదరు సత్యనారాయణ పాల్వంచ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.కాగా చింతకాని పోలీస్ స్టేషన్‌లో బాదితుడు సత్యనారాయణ సైబర్ క్రైమ్ నేరానికి పాల్పడినట్లు కేసు నమోదైనట్లు తెలుస్తోంది. ఎవరు కూడా అపరిచితులను నమ్మి మోసపోవద్దని సూచిస్తున్నారు.

## దార్శనిక దేవాలయాలుగా

# ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు



**-లక్ష్మీపురం స్కూల్ పనుల్లో వేగం పెంచండి**
**-విద్యపై పెట్టే ప్రతి రూపాయి..**
**భవిష్యత్ తరాల కోసం పెట్టుబడి**
**-డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**ప్రజాపక్షం/బోనకల్:** రాష్ట్రంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కేవలం భవనాలు కావని, అవి రేపటి తరాన్ని ఉజ్వలంగా తీర్చి దిద్దే దార్శనిక దేవాలయాలు అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభివర్ణించారు. విద్యకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ పరిధిలోని బోనకల్లు మండలం లక్ష్మీపురంలోని ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**-నాణ్యతతో..వేగంగా పూర్తి చేయాలి...**

నిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలలోని భవన సముదాయాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాలినడకన తిరుగుతూ క్షుణ్ణంగా పరిశీలించారు. జూనియర్ హాస్టల్, జూనియర్, సీనియర్ విభాగాలు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణ ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు వేదికలుగా నిలిచే మెకానికల్, సైన్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ ల్యాబ్ భవనాల పనులను ప్రత్యేకంగా పరిశీలించారు. పనుల్లో ఎక్కడ నాణ్యత లోపించకుండా, నిబంధనల ప్రకారం అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. పనులను మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

**-ఆలోచనే ఒక పెట్టుబడి!**

విద్యకోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి..కేవలం వ్యయం కాదు, అది రాబోయే భవిష్యత్ తరాలను శక్తివంతంగా నిర్మించడం కోసం పెట్టే అద్భుతమైన పెట్టుబడి అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లక్ష్మీపురం స్కూల్ ఆవరణ అంతా తిరుగుతూ పనుల ప్రగతిని స్వయంగా అంచనా వేసిన డిప్యూటీ సీఎం సైన్స్, మ్యాథ్స్, కంప్యూటర్, మెకానికల్ ల్యాబ్ భవనాల నిర్మాణ నాణ్యతపై అధికారులకు కీలక సూచనలు. గడువులోగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారులకు డిప్యూటీ సీఎం స్పష్టంగా చెప్పారు.

# శ్రమ దోపిడీకి గురవుతున్న స్వీపర్లు




**-ఏఐటియుసి నాయకులు శింగు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు తెలిపారు. రాష్ట్రంలో వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న వారు 50వేల మందికి పైగా ఉన్నారని వీరికి గుర్తింపు కానీ, కనీస వేతనం కానీ దక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఏఐటియుసి కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో స్వీపర్ల జిల్లా స్థాయి సమావేశం ఎన్‌కె గౌస్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శింగు నర్సింహారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్వీపర్లను గుర్తించే పరిస్థితి కూడా లేదని గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లను సర్వీస్ పర్సన్స్‌గా గుర్తించారని ఆయన తెలిపారు. శ్రమకు గుర్తింపు ఇవ్వలేదని, అతి తక్కువ వేతనాలు ఇచ్చి ఎక్కువ పని చేయించుకుంటున్నారని ఆయన తెలిపారు. పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో జాయింట్ అకౌంట్లు ఓపెన్ చేసి ఆ ఖాతాల్లో నుంచి స్వీపర్లకు వేతనాలు ఇస్తున్నారని అరకొర వేతనాల నుంచే చీపుర్లు, ఇతర సామాగ్రి ఇచ్చే పేరుతో కోత విధిస్తున్నారని తెలిపారు. స్వీపర్లకు కనీస వేతనం నెలకు రూ. 26వేలు చెల్లించాలని అది కూడా నేరుగా స్వీపర్ల ఖాతాల్లోనే జమ చేయాలని శింగు నర్సింహారావు డిమాండ్ చేశారు. స్వీపర్ల సమస్య పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళన చేపడతామని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో శ్రామిక మహిళా జిల్లా బాధ్యులు సిహెచ్ సీతామహాలక్ష్మి , స్వీపర్ల సంఘం నాయకులు ఎల్. మీరా, పుల్లారావు,దేవా, అన్నపూర్ణ, శిరీష, రాణి పాల్గొన్నారు.

# నలుగురిలో ఒకరికి బిపీ, ఐదుగురిలో ఒకరికి షుగర్



**-ప్రముఖ బిపి, షుగర్, జనరల్ వైద్యులు పవన్‌కుమార్**
**-బత్తినేని ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య క్యాంపులు**
**-69వ బిపి, షుగర్ ప్రత్యేక క్యాంపు విజయవంతం**

**ప్రజాపక్షం/బోనకల్:** ప్రతి నలుగురిలో ఒకరికి బిపీ, 30 ఏళ్లు నిండిన ప్రతి ఐదుగురిలో ఒకరికి షుగర్ వ్యాపిస్తుందని ప్రముఖ బిపి, షుగర్, జనరల్ వైద్యులు టి పవన్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని తూము ప్రకాశరావు భవన్‌లో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ప్రతి నెల మొదటి ఆదివారం నిర్వహించే బిపి, షుగర్ ప్రత్యేక 79వ క్యాంపు ఆదివారం విజయవంతమైంది. ఈ సందర్భంగా వైద్యులు టి పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం అనారోగ్యం బారిన పడే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోందని, తినే ఆహారం, మానసిక ఒత్తిళ్లు, ఆర్థిక ఇబ్బందులు, నిద్రలేమి, సరైన వ్యాయామం లేకపోవడం తదితర కారణాల వల్ల అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారన్నారు. ఇక ఎక్కువగా బిపీ, షుగర్లు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయని, గతంలో పట్టణాల్లో ఎక్కువగా కనిపించే ఈ జబ్బులు ఇప్పుడు పల్లెల్లోనూ వ్యాపిస్తున్నాయన్నారు. గ్రామాల్లో 26 శాతం మంది, పట్టణాల్లో 30 శాతం మంది బిపి బాధితులు, పల్లెల్లో 19 శాతం మంది, పట్టణాల్లో 24 శాతం షుగర్ బాధితులున్నట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయన్నారు. భారీ స్థాయిలో బీపీ, షుగర్ బాధితులుండటం అత్యంత ఆందోళన కలిగించే అంశమని ఆందోళన వ్యక్తం చేశారు. అవగాహన లేక కొందరు, నిర్లక్ష్యంతో మరికొందరు ఈ రెండు ప్రమాదకర జబ్బులను నియంత్రణలో ఉంచుకోలేక గుండె జబ్బుల బారిన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, మండల కార్యవర్గ సభ్యులు ఆకెన పవన్, టిడిపి నాయకులు దుగ్గి భద్రయ్య, గొల్లపల్లి కృష్ణారావు, క్యాంపు సహాయకులు యంగల గిరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరక్ష ఆరోగ్య యాత్రలో భాగంగా అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/ఖమ్మం:** మామిళ్లగూడెం ప్రాంతంలోని 47వ డివిజన్‌లో శ్రీరక్ష హాస్పిటల్ అధినేత , శ్రీరక్ష చారిటీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇంటి ఇంటికి శ్రీరక్ష కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మెడికల్ ప్రాక్టీషనర్ బూరగడ్డ గోపాల్, ప్రముఖ న్యాయవాది కొండపల్లి జగన్మోహన్‌రావు పాల్గొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతీకగా నిలిచిన జయజయహే తెలంగాణ గీతాన్ని 1556 రోజుల పాటు నిరంతరాయంగా కోర్టు ప్రాంగణంలో ప్రతిరోజు ఉదయం 10.10 గంటలకు ఆలపిస్తూ విశిష్ట గుర్తింపు పొందిన కొండపల్లి జగన్మోహన్‌రావు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. శ్రీరక్ష ఆరోగ్య యాత్ర బృందం ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, జీవనశైలి మార్పులు, వ్యాధి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల ఆరోగ్యంపై పర్యావరణంపై కలిగే దుష్ప్రభావాలను వివరించి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ జివి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి కుటుంబం ఆరోగ్య పరిరక్షణ పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించాలని అన్నారు. స్థానిక ప్రజలు కార్యక్రమానికి విశేష స్పందన తెలియజేసి శ్రీరక్ష సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ప్రజారోగ్యం, సామాజిక చైతన్యం పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా శ్రీరక్ష సంస్థ మరిన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు డివిజన్ పరిధిలోని కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాలకు చెందిన బి ఎల్ వో లకు శిక్షణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న జీరో అనామలిష్ జాబితాను అత్యవసరంగా పరిశీలించి ఎటువంటి ఆలస్యం లేకుండా అభ్యంతరాలు లేకుండా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా ప్రతి అభ్యంతరాలను క్షుణంగా పరిశీలించి 100% ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలు మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దిష్ట గడువులోపు పూర్తిచేయాలని బిఎల్ఓ లకు ఆదేశించారు. ఎన్నికల జాబితా ల స్వచ్ఛత పారదర్శకత మరియు నాణ్యతను కాపాడేందుకు బిఎల్వోలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారులు ఆర్ఐ లు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దుర్గా వైన్స్‌లో మౌలిక వసతుల కొరత..!

**- పర్మిట్‌రూం వద్ద మందుబాబుల అవస్థలు**
**- టాయిలెట్లు, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు లేక ఇబ్బందులు**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న దుర్గా వైన్స్‌లో మౌలిక వసతుల కొరత తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వైన్స్‌కు అనుబంధంగా నిర్వహిస్తున్న పర్మిట్ రూంవద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో మందుబాబులు ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయంటున్నారు. వైన్స్ పాంగాణంలో సరైన టాయిలెట్ సదుపాయం లేకపోవడంతో పాటు పార్కింగ్‌కు తగిన స్థలం లేకపోవడం సమస్యగా మారింది. అంతేకాకుండా భద్రతా పరమైన సేవలు అందుబాటులో లేకపోవడంతో రద్దీ సమయాల్లో పరిస్థితులు అస్తవ్యస్తంగా మారుతున్నాయని పేర్కొంటున్నారు. తాజాగా కురిసిన వర్షాల నేపథ్యంలో పరిస్థితి మరింత దారుణంగా మారినట్లు పేర్కొంటున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండటంతో పాటు పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొనడం వల్ల మందుబాబులు తీవ్ర అసౌకర్యానికి గురువుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందు బాటిల్‌పై మాకు కల్పించాల్సిన సేవలకు ట్యాక్స్ కట్టి మందు కొనుగోలు చేస్తున్నట్లు తెలుపుతున్నారు. కానీ వైన్స్ నిర్వాహకులు అవి మాకు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నానరని ఆరోపిస్తున్నారు. ఈ సమస్యలపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# అంతా వర్చ్యువల్ మాయ..!

## వాట్సాప్ స్టేటస్‌లతో పెరుగుతున్న మానసిక రోగులు..!



వాట్సాప్ స్టేటస్.. 'మానసిక' రోగమా? నేలకొండపల్లి మండలం గ్రామీణ యువతలో ఆందోళన.




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు నేటి తరం చేతుల్లో స్మార్ట్‌ఫోన్లే రాజ్యమేలుతున్నాయి. సాంకేతికత పెరిగి లోకం చేతిలోకి వచ్చిన మాట వాస్తవమే అయినా.. అదే సాంకేతికత మనుషుల ఆలోచనా విధానాన్ని బందీ చేస్తోంది. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇటీవలి కాలంలో చాలామందికి వాట్సాప్‌లో స్టేటస్ పెట్టుకోవడం ఒక అలవాటుగా కాకుండా, ఒక తీవ్రమైన వ్యసనంగా (అడిక్షన్) మారిపోయింది. ఉదయం తాగే కాఫీ దగ్గరి నుంచి.. రాత్రి పడుకునే ముందు పెట్టే గుడ్‌నైట్ మెసేజ్ వరకు, చివరికి ఇంట్లో జరిగే చిన్న చిన్న గొడవల వరకు ప్రతి విషయాన్ని క్షణాల్లో స్టేటస్ రూపంలో ఫోన్ స్క్రీన్ పైకి ఎక్కించేస్తున్నారు. ఇలా చీటికీ మాటికీ వాట్సాప్ స్టేటస్ మార్చడం వెనుక ఒక పెద్ద 'మానసిక ఒంటరితనం', మానసిక బలహీనత దాగి ఉన్నాయని సైకాలజిస్టులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### నాలుగు గోడలు దాటి రోడ్డున పడుతున్న వ్యక్తిగత జీవితాలు

సోషల్ మీడియా వాడకం విపరీతంగా పెరిగిన తర్వాత మనుషుల వ్యక్తిగత జీవితాలకు గోప్యత లేకుండా పోయింది. ఒకప్పుడు కుటుంబ సమస్యలు, ఆనందాలు నాలుగు గోడల మధ్యే ఉండేవి. కానీ ఇప్పుడు అంతా రోడ్డు మీదికి వచ్చేస్తోంది. సంతోషం వచ్చినా, బాధ కలిగినా దాన్ని గుండెల్లో దాచుకోలేకపోతున్నారు. క్షణికావేశంలోనో, ఆనందంలోనో వెంటనే దాన్ని స్టేటస్‌గా పెట్టడమో, ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయడమో చేస్తున్నారు. తమ ఆవేదనను ఇలా ఇంటర్నెట్ ప్రపంచంలో పంచుకుంటేనే మనసుకు ప్రశాంతత దక్కుతుందనే ఒక పెద్ద భ్రమలో ప్రజలు బతికేస్తున్నారు. ఈ అలవాటు క్రమంగా వారి 'ఉనికి'ని చాటుకునే ఒక తీవ్రమైన అవసరంగా మారిపోతోంది. సమాజంలో తాము కూడా ఉన్నామని పదిమందికి చెప్పుకోవడానికి డిజిటల్ స్క్రీన్‌లను ఆశ్రయించడం విచారకరం.

### ఆ ఒక్కరి కోసమే ఈ ఇండైరెక్ట్ తిప్పలన్నీనా..?

చాలామంది పెట్టే స్టేటస్‌ల వెనుక ఒక విచిత్రమైన, ఆశ్చర్యకరమైన మానసిక కోణం దాగి ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వారు పెట్టే స్టేటస్ కాంటాక్ట్స్ లో ఉన్న ప్రపంచమంతటికీ కనిపించినా.. వారి అసలు ఉద్దేశం మాత్రం అందరికీ చెప్పడం కాదు..! తాము కోరుకునే ఒక ప్రత్యేక వ్యక్తి (స్పెషల్ పర్సన్) ఆ స్టేటస్ చూడాలి, తమ మనసులోని బాధను, అసంతృప్తిని లేదా కోపాన్ని అర్థం చేసుకోవాలి అన్నదే వారి ప్రధాన కోరిక.

ఎదుటివారితో నేరుగా మాట్లాడే ధైర్యం లేక, పగను లేదా ప్రేమాభిమానాలను పరోక్షంగా (ఇండైరెక్ట్ కమ్యూనికేషన్) వ్యక్తపరచడానికి ఈ స్టేటస్‌లను ఆయుధాలుగా వాడుకుంటున్నారు. ఇది వారిలో ఉన్న తీవ్రమైన ఒంటరితనాన్ని, భయాన్ని స్పష్టంగా చూపిస్తోంది.

వ్యూస్, రిప్లైల కోసం క్షణక్షణానికి ఆరాటం స్టేటస్ పెట్టడం ఒకెత్తయితే.. పెట్టినప్పటి నుంచి నిమిషాల వ్యవధిలో, వీలైతే సెకన్ల వ్యవధిలో ఫోన్ ఓపెన్ చేసి చూసుకోవడం మరో పెద్ద జబ్బుగా మారింది.

**నా స్టేటస్‌ను ఎంతమంది చూశారు?**

**నేను అనుకున్న ఆ ఒక్క వ్యక్తి చూశాడా లేదా?**

**ఎవరైనా దీనికి రిప్లై లేదా ఎమోజీ ఇచ్చారా?**

ఇదే ఈ తరం కొందరికి జీవితంలో అత్యంత ముఖ్యమైన విషయంగా మారిపోయింది. ఎవరైనా రిప్లై ఇస్తే నన్ను సమాజం గమనిస్తోంది. నాకంటూ ఒక విలువ ఉంది' అనే తాత్కాలిక, కృత్రిమ సంతోషాన్ని పొందుతున్నారు. ఒకవేళ తాము అనుకున్న వ్యూస్ రాకపోతే లేదా అనుకున్న వ్యక్తి చూడకపోతే తీవ్ర నిరాశకు, డిప్రెషన్‌కు లోనవుతున్నారు. ఇది ఒక రకమైన తీవ్రమైన మానసిక బలహీనతకు నిదర్శనం.

# పగలంతా గ్రామ సభల్లో .. అర్ధరాత్రులు చెరువుల్లో..!

## -ఇరిగేషన్ శాఖ అధికారుల సేవలు ప్రశంసనీయం







**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల పరిధిలో ప్రభుత్వ చెరువులు, కుంటలు, కాలువలు, ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో ఇరిగేషన్ శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఒక వైపు గ్రామాల్లో జరుగుతున్న గ్రామ సభలు, ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాల్లో పాల్గొంటూనే మరోవైపు రాత్రింబవళ్లు చెరువుల వద్ద పహారా కాస్తూ అక్రమ మట్టి తవ్వకాలపై నిఘా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల నుంచి అనుమతి లేకుండా మట్టి తరలింపులు జరుగుతున్నాయనే సమాచారంతో డీఈ శ్రీనివాసరావు, ఏఈ పిట్టి శేఖర్, లస్కర్లు టి వెంకన్న, ఉల్లోజు వెంకన్న, మరో నలుగురు లస్కర్లు మొత్తం ఆరుగురు లస్కర్లు తరచూ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో కూడా చెరువుల వద్దకు వెళ్లి పరిస్థితులను పరిశీలించడం, అనుమానాస్పద వాహనాలను గుర్తించడం, సంబంధిత అధికారులకు సమాచారం అందించడం వంటి చర్యలతో మట్టి మాఫియాకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యతలో భాగంగా ఇరిగేషన్ శాఖ అధికారులు అనేక ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ విధి నిర్వహణలో రాజీపడకుండా పని చేస్తున్నారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పగలంతా గ్రామసభలు, ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణలో నిమగ్నమై, రాత్రి వేళల్లో చెరువుల వద్ద పహారా కాస్తూ విధులు నిర్వర్తించడం సాధారణ విషయం కాదని పలువురు పేర్కొంటున్నారు. మట్టి మాఫియా అక్రమాలకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో ఇరిగేషన్ శాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలు ఫలితాలిస్తున్నాయని, చెరువుల పరిరక్షణలో వారి పాత్ర కీలకంగా మారిందని గ్రామస్తులు అంటున్నారు. ప్రభుత్వ భూములు, జలవనరులు భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండాలంటే ఇలాంటి అధికారులకు అన్ని శాఖల సహకారం అవసరమని ప్రజలు కోరుతున్నారు. అక్రమ మట్టి తవ్వకాలపై మరింత కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆస్తులను రక్షించడంలో ఇరిగేషన్ శాఖ అధికారులు ఇదే పట్టుదలతో ముందుకు సాగాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కూసుమంచి మండలంలో చెరువుల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఇరిగేషన్ శాఖ సిబ్బంది సేవలు అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు.

# కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లో పలువురి చేరిక

## -పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మనీషా లక్ష్మీ





**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల పరిధిలోని కాలనీ నాచారం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి వైరా బిఆర్ఎస్ నాయకురాలు మనిషా లక్ష్మీ మదన్ లాల్ బిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కేసుపల్లి గ్రామానికి చెందిన గూగుల్ మోతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె దశ దిన కార్యక్రమానికి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీరామ్‌పురం తండా గ్రామంలో ఆంగో శ్రీను ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. ఎర్రబడుతండా గ్రామంలో ముఖ్య కార్యకర్తలు సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడుతూ వైరా నియోజకవర్గంలో రాబోయేది బిఆర్ఎస్ పార్టీ అని నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని ఆమె తెలిపారు. కార్యకర్తలకు ఎలాంటి కష్టమొచ్చిన నేనుంటా అంటూ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సర్పంచులు జరా సాంబయ్య, బానోతు వెంకన్న, నాయకులు మల్లెంపాటికి మాధవరావు, మల్లెంపాటి హరిబాబు, అజ్మీరా రైలు, చీటీ ముత్యం, గణేశుల బాబు, పుల్లయ్య, రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నిరంతర విద్యుత్ సరఫరా ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నిరంతరం విద్యుత్ ను సరఫరా చేయటమే ప్రభుత్వ లక్ష్యమని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కోన్నారు. మండలంలోని కొత్తకొత్తూరు లో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కెవీ విద్యుత్ ట్రాన్సఫార్మర్ ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ పల్లెలో విద్యుత్ వెలుగులు అందించేందుకు ప్రభుత్వం అధనంగా ట్రాన్స్ ఫార్మర్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పేదలకు నాణ్యమైన విద్యుత్ మరియు అంతరాయం లేకుండా అందించేందుకు మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ ను అనేక మంది పేదలు లబ్ధిపొందుతున్నారని అన్నారు. గత పాలకుల వలన చీకట్లో బ్రతుకులు వెళ్లదీశారని పేర్కోన్నారు. ఆర్ధిక భారమైనప్పటికీ ఉచిత విద్యుత్ ను అందించేందుకు ప్రభుత్వం సంకల్పంచిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాళోత్ కవిత, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, వార్డు సభ్యులు బొల్లగాని వెంకటరామారావు, గుగులోత్ వెంకటి, ఠాగూర్సింగ్, గ్రామ పెద్దలు మాలోత్ అయోధ్య, రామయ్య, జ్యోతిబస్సు, వల్లాల కృష్ణ, కోటేశ్వరరావు, చావా వెంకటేశ్వరరావు, రవి, హానుమా, కాకామాను మల్లిఖార్జునావు, మూడు రమేష్, సత్యనారాయణ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెట్రేగిపోతున్న ఆకతాయిలు..!

## - ప్రదర్శిస్తున్న రౌడీయిజం -ఒకరిపై ఒకరు దాడులు -పోలీసుల వైఫల్యం?

**ప్రజాపక్షం/పాల్వంచ :** వివిధ సమస్యలపై ఫిర్యాదు చేయటానికి స్టేషన్‌కు వచ్చే వారితో ఫ్రెండ్లీగా నడుచుకోవటంతో కొందరు వ్యక్తులు పోలీసుల మంచితనాన్ని చేతగాని తనంగా భావిస్తూ అలుసుగా తీసుకొంటున్నారని తెలుస్తోంది. గంజాయి, మద్యం మత్తులో పాల్వంచలో ఆకతాయిలు పెట్రేగిపోతున్నారు. చిన్న చిన్న విషయాలను మనసులో పెట్టుకొని రౌడీయిజం ప్రదర్శిస్తున్నారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవటానికి తెగబడుతున్నారు. గత కొన్ని నెలల కిందట అంబేద్కర్ సెంటర్‌లో ఓ వ్యక్తిపై కొందరు మూకుమ్మడి దాడి చేస్తున్న సమయంలో పోలీస్ సిబ్బంది సకాలంలో ప్రాణాలకు తెగించి బాదితుడిని కాపాడారు. కొన్ని రోజుల క్రితం కిన్నెసాని రోడ్‌లోని ఓ బార్ షాప్ ఎదుట గ్యాంగ్ వార్ నడిచింది. వారం రోజుల కిందట దమ్మపేట సెంటర్‌కు చెందిన ఓ ఇద్దరు మద్యన జరిగిన ఆటో లావాదేవిల్లో కొత్తగూడెం నుండి వచ్చిన మరో యువకుడి సమక్షంలో తలెత్తిన వివాదంలో కత్తితో దాడి చేశారు. ఇదే విధంగా బస్టాండ్ సమీపంలో రాత్రి సమయంలో కొందరు యువకులు గుంపులుగా తిరుగుతూ గొడవలు సృష్టించారు. అడ్డగించిన కానిస్టేబుల్ పై చేయి చేసుకొన్నంత పని చేసి భయభ్రాంతులకు గురి చేశారని గుసగుసలు. తాజాగా సీతారామపట్నంలో పాత కక్ష్యలను మనసులో పెట్టుకొని ఈ నెల 4వ, తేదీ గురువారం కార్పోరేటర్, ఆమె భర్తపై కొందరు యువకులు, మహిళలు కలిసి పెద్ద ఎత్తున దాడికి దిగారు. దీనితో ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకొన్నారు. ఇదిలా ఉండగా తరచూ యువత మద్యం మత్తులో ఉండి తగాదాలకు దిగుతున్నారని గత కొన్ని వారాలుగా కార్పోరేటర్ తమ వార్డులో బెల్ట్ షాపులను క్లోజ్ చేయాలని సంభందిత అధికారులకు ఫిర్యాదు చేశారని, సీతారామపట్నంలో రాత్రి వేళల్లో పోలీసులు నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసులను కోరారు. కానీ వారి అభ్యర్ధనలను ఎంత మాత్రం పట్టించుకోకుండా అధికారులు భేఖాతర్ చేయడంతో గొడవ జరగిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్య వైఖరి, సమస్యలను, వాటి తీవ్రతలను పట్టించుకోక పోవటంతో ఘర్షణలు జరిగాయని విమర్శలు తలెత్తుతున్నాయి. నిందితుల జాడ తెలుసుకోవటానికి, పట్టుకోవటానికి తగిన సమాచారాన్ని అందజేసే సిసి కెమెరాల నిర్వాహణా లోపం, పోలీసుల భయం లేకపోవటంతో కొందరు యువకులు విచ్చల విడిగా గంజాయికి , మద్యానికి బానిసై గొడవలకు దిగుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నారనే పట్టణ వ్యాప్తంగా వాదనలు వినిపిస్తున్నాయి. ఇకనైనా పోలీసు శాఖ రాత్రి సమయంలో గుంపులు, గుంపులుగా తిరుగుతున్న గ్యాంగులపై దృష్టి సారించాలని, గంజాయి స్పాట్లను గుర్తించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. రౌడీ షీటర్లకు నెల నెలా క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ ఇస్తూ వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని అంటున్నారు. లేని యెడల తొండ ముదిరి ఊసరవెల్లిలా తయారయే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. మొగ్గలోనే తుంచేసి రౌడీయిజానికి చెక్ పెట్టాలని కోరుచున్నారు. ఈ విషయంపై పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ. నాగరాజు వివరణ కోసం చరవాణి ద్వారా ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.